# రక్ష కవచం

## చలపాక ప్రకాష్

**అర్థరాత్రి సమయం ఒంటిగంట కావస్తుంది. అది శీతాకాలం కావడంతో ఎముకలు కొరికే చలిగాలి వీస్తుంది. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. అటువంటి సమయంలో యిద్దరు యువతులు తాము చూసి వస్తున్న సినిమా గురించి చర్చించుకుంటూ నడుస్తున్నారు. 'ఆడది అర్థరాత్రి ఒంటరిగా నడిచే రోజున మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు భావించాల'న్న గాంధీగారి మాట ఆ యువతులు నడిచి వెళ్తున్న తీరును చూస్తే గుర్తు వస్తుంది.**

ఆ యువతులిద్దరూ కాలేజి స్టూడెంట్స్ కావటం వలన వాళ్ళలో ఆ తెగింపు వచ్చి వుండవచ్చు. వారి పేర్లు సన్నగా, మెరుపు తీగలా వున్న యువతి పేరు పద్మ. పొట్టిగా, బొద్దుగా వున్నామె పేరు సృజన. వాళ్ళిద్దరూ ఒకే క్లాస్‌మేట్స్ కావడం ఒక కారణమైతే వాళ్ళు నివసించే ఇళ్ళు కూడా ఒకే వీధిలో వుండడం కారణంగా వారిరువురూ మంచి స్నేహితురాళ్ళు కాగలిగారు.

అంతవరకూ తాము చూసిన 'కర్తవ్యం' సినిమా గురించి పిచ్చాపాటిగా మాట్లాడుతుకుంటున్న ఆ స్నేహితురాళ్ళిద్దరికీ ఎందుకో అనుమానం కలిగి మాటల్లోనే వెనక్కి తిరిగిచూశారు. స్ట్రీట్‌లైట్ వెలుగుకి అంత దూరాన కొన్ని నీడలు తమని అనుసరిస్తున్నట్టుగా అవగాహన చేసుకోగలిగారు. జనసంచారంలేని అటువంటి సమయంలో తమని అనుసరిస్తున్నది ఏ పోకిరి గాళ్ళో అయితే? అని కొంత భయాన్ని ఆ యిద్దరికీ కలిగించినప్పటికీ అది తమ భ్రమేనేమో అని అనుకున్నారు. అయినా ఈ రోజుల్లో కాలేజీల్లో జరుగుతున్న ర్యాగింగ్ అనుభవాల కారణంగా ఎటువంటి పోకిరీ గాళ్ళకీ జడవాల్సిన పనేలేకుండా మాటకి మాట జవాబిచ్చే తెగింపు ఈనాటి యువతుల్లో కనిపిస్తుంది. ఆ ధైర్యంతోనే నేటి ఆడపిల్లలని ఒంటరిగా ఎక్కడికైనా పంపగలుగుతున్నారు తల్లిదండ్రులు.

'ఈ సినిమాలో విజయశాంతి ఫైట్స్ చాలా బాగున్నాయ్. నిజంగా అంత ధైర్యం, తెగింపు మన ఆడవాళ్ళందరిలో వుండివుంటే ఈ పురుషాధిక్యత ప్రపంచానికి ఆడది తలవంచకుండా ఎదిరించి నిలిచేది' ఆవేశంగా అంది పద్మ.

'విజయశాంతి ఫైట్స్ చేసిందంటే అది సినిమా వరకే పరిమితం. నిజజీవితంలో ఆడవాళ్ళు ఫైట్స్‌చేసి మగవాళ్ళని ఎదిరించి అదుపులో పెట్టుకోలేరు కదా. ఏదేమైనా జీవితం జీవితమే. సినిమా సినిమాయే. అయితే ఆడదానికి కావాల్సింది ధైర్యం తెగింపే కాదు. వాటికంటే ముందు సరైన ఆలోచనా శక్తి వుండాలి. ఒక మగవాడిని ఎదురించాలంటే ఆడది ఆవేశంతో ఫైట్స్ చెయ్యక్కర్లేదు. మంచి ఆలోచనా విధానముంటే ఒక మగవాడ్నే కాదు. ఈ ప్రపంచంలో దేన్నైనా ఎదిరించవచ్చు' అంది నింపాదిగా సృజన.

మెయిన్‌రోడ్డు నుంచి చీకటిగా ఉన్న సందులోకి తిరుగుతున్న పద్మ, సృజనలకి వెనుక నుంచి తమని అనుసరిస్తున్న నీడలు కూడా తాము తిరిగిన సందువైపే తిరిగి తమకి మరింత దగ్గరవుతున్నట్టు గ్రహించారు. స్వతహాగా కాస్తంత పిరికిదైన పద్మ భయంతో అడుగుల స్థాయిలో వేగాన్ని పెంచింది.

'ఎందుకే అంత భయం నీకు?' ఇప్పుడేగా విజయశాంతి ఫైట్లను మెచ్చుకున్నావ్. వచ్చేది ఏ పోకిరీ వెధవలో అయితే ఫైటింగ్‌చేసి ఎదుర్కోవచ్చుగా' అంది సృజన పద్మ భయాన్ని చూసి ఎగతాళిగా.

'చాల్లేవే' ఇందాక సినిమా చూసిన మూడ్‌లో అలా అన్నాగానీ, అసలే మా అమ్మ ఇంటి దగ్గర బైలుదేరే ముందు అంటూనేవుంది. సెకండ్ షోకి పోవద్దే. ఆడపిల్లవి. రోజులన్నీ మనవే అనుకోకే అని. నేను వినిపించుకుంటేగా. ఏదో నువ్వు రమ్మన్నావని, కాదనలేక వచ్చానంతే. ఇప్పుడు చూడు ఏమైందో. ఆ నలుగురు కుర్రాళ్ళు మనల్నేలా వెంబడిస్తున్నారో. త్వరగా అడుగులు వేయ్. నాకు మనం ఇల్లు చేరుకుంటేగాని మనశ్శాంతి వుండదు' అంది భయంగా పద్మ.

ఇంతలో వాళ్ళని వెంబడిస్తూ వచ్చిన నీడలు దగ్గరయ్యి పద్మ, సృజనల నాలుగువైపులా కాపుకాశాయ్.

'హాయ్ బేబీస్' పళ్ళికిలిస్తూ పలకరించాడు వచ్చిన నీడల్లో ఒకడు. ఒక్కసారి భయంతో బిక్కచచ్చి పోయింది పద్మ. సృజన మాత్రం ధైర్యంగా 'వ్హాట్?' అని అరిచింది కోపంగా.

'ఒకసారి మాతో ఆ మూలకొస్తారా?' అన్నాడు వాడు.

'దేనికి?' ఎందుకో తెలీనట్టు నటిస్తూ అంది కోపాన్ని అణుచుకుంటూ.

'ఆ మాత్రం తెలియని పాపాయిలా మీరు. చూస్తే కాలేజీ బేబీల్లా వున్నారు. అర్థరాత్రి మగాడు ఆడదాన్ని మూలకొస్తావా అని అంటే ఎందుకో తెలియనట్టు ప్రవర్తిస్తున్నారంటే మీరు చాలా అమాయకురాళ్ళే. పోనీ ఎందుకు రమ్మన్నామో ఏమిటో తెలియచెప్తాము. ఇలా ఆ మూలకి రండి' అంటూ పద్మను తనమీదకి లాక్కున్నాడు వాళ్ళలో మరొకడు. మరో యిద్దరు సృజన భుజాలని ఒడిసిపట్టుకున్నారు.

'ప్లీజ్. మమ్మల్నేం చెయ్యొద్దు' ప్రార్థించింది పద్మ.

అంతే ఫక్కున నవ్వారు నలుగురూ ఒక్కసారిగా. వాళ్ళ వెకిలినవ్వు పద్మ, సృజనలకి కంపరాన్ని పుట్టించింది.

ఇప్పుడు జరగబోయేదేమిటో అర్థం అయ్యేసరికి ఆ స్నేహితురాళ్ళిద్దరికీ ముచ్చెమటలు పోశాయి. అయినా ఏం చెయ్యగలరు. తామిద్దరూ అబలలు. వాళ్ళను ఎదుర్కొనే ధైర్యం తమలోలేదు. ఎలా వీళ్ళ బారి నుండి బైట పడటం? దారుల కోసం వెదికారు. ఊహు. తాము వచ్చిన దారిలో తాము తప్ప, సినిమా వదిలి హాలు నుండి బైటకొచ్చిన వాళ్ళలో ఒక్కరూ అటువైపుగా రాలేదు. పోనీ హెల్ప్ అంటూ అరిస్తే ఎవరైనా వచ్చి రక్షించకపోతారా? అన్న ఆలోచన పద్మకి తట్టింది. ఆలోచన తట్టిందే తడవుగా వెనుకా ముందు ఆలోచించకుండా 'హెల్ప్ హెల్ప్' అంటూ గట్టిగా అరచింది. అంతే. అప్పటి వరకూ కేవలం మాటలతోనే కాలక్షేపం చేస్తున్న ఆ నలుగురిలో ఆమె అరచిన అరుపుకి వాళ్ళు తొందరపడటానికి వుసిగొలిపినట్టైంది.

'ఒరేయ్! ఇక వీళ్ళని మాటలతో లొంగతీసుకోవాలనుకోవడం మనకే మాత్రం మంచిదికాదు. త్వరగా చేతల్లో చూపించెయ్యండి.' కంగారు చేశాడు వాళ్ళలో ఒకడు. అలా అంటూనే పద్మ జాకెట్‌ను చించేశాడు. మరొకడు ఆమె ఓణీ లాగేసి ఒక్క వుదుటున ఆమెని

క్రిందకి దొర్లించాడు. పద్మ కెవ్వున కేకపెట్టింది. ఒకడు ఆమె చేతులు కదల్చకుండా గట్టిగా పట్టుకుంటే రెండో వాడు ఆమె మీదకు వంగాడు. పద్మ అతన్ని బ్రతిమలాడుకుంది. అరిచింది. శపించింది. అయినా ఆ రాతి గుండె కరగలేదు. చివరగా ఆమె మీదకు వంగిన వాడిని కాళ్ళతో చాచి తన్నింది. అనుకోని విధంగా తన్నిన ఆ దెబ్బకి అతను అంత దూరాన పడ్డాడు. అప్పటి వరకూ ఆ తతంగాన్ని చొంగకార్చుకుంటూ చూస్తున్న సృజనని ఒడిసి పట్టుకున్న యువకుల్లో చలనం వచ్చింది.

'ఒరేయ్! దీన్ని పారిపోకుండా గట్టిగా పట్టుకోమండు. ముందా గడుసుదాని పని పట్టింతర్వాత ఈ వగలాడి పని చూద్దాం' అంటూ సృజనని వదిలి, పద్మ కాళ్ళు గట్టిగా కదల్చనీయకుండా పట్టుకున్నాడు. ఒకడు కాళ్ళు మరొకడు చేతులు గట్టిగా ఒడిసి పట్టుకోవడంతో ఇక పద్మకి కదిలే అవకాశమే కలగలేదు. ఆమె ఏడుస్తోంది. మధ్యలో అరుస్తుంది. ఆమె దీనంగా అరుస్తున్నా ఆ అరుపుకు ఆ కసాయి మనసులకు మరింత ఉత్సాహం వస్తుంది. ఇంతకు ముందు క్రిందపడిన వాడు మళ్ళీ ఒక్క వుదుటున లేచి ఆమె మీదకు వంగాడు. ఇక వాళ్ళని ఎదుర్కొనే అవకాశం ఏవిధంగానూ లేకపోవడంతో 'ధూ' అంటూ తన మీదకి వంగిన వాడిమీద వూసింది బెదిరింపుగా, ఆమె మీదకి వంగబోతున్నవాడు ఆమె వూసిన వుమ్మును తన షర్ట్‌కి తుడుచుకుంటూ.

'ఏమిట్రా బాబూ! ఇది పెద్ద గయ్యాళిలాగుంది. ఒక పట్టాన లొంగేలా లేదు' అన్నాడు అసహనంగా.

అంతవరకూ వాళ్ళబారి నుండి ఎలా బయటపడాలో మార్గాల కోసం ఆలోచిస్తున్న సృజనకి తళుక్కున తట్టింది ఒక ఆలోచన. అంతే అది వెంటనే ఆచరణలో పెట్టేసింది.

'డియర్ ఫ్రెండ్స్' పిలిచింది వాళ్ళని. పద్మతో పెనుగులాటకి అసహనంగా వున్న ఆ యువకులు ఏమిటన్నట్టుగా చూశారు వినుగ్గా.

'మీతో సహకరించని దాని దగ్గరకెళ్ళి మీరు అసహనానికి గురి కావటం దేనికి.దాన్ని వదిలి నాతో ఎంజాయ్ చెయ్యండి. నేను మీతో పూర్తిగా సహకరిస్తాను' అంది. పమిట జారవిడుస్తూ కొంటెగా. తనను ఇబ్బందికి గురిచేస్తున్న పద్మని వదిలి, వెంటనే సృజన వెంట పడ్డారు వాళ్ళు.

'మా పద్మకి అసలెలా ఎంజాయ్ చేయాలో తెలిసిచావదు. అదే నేనైతే మా కాలేజీలోని బాయ్ ఫ్రెండ్స్‌తో ప్రతిరోజూ భలే ఎంజాయ్ చేస్తానంటే నమ్మండి. ఎవడ్నో ఒకడ్ని పెళ్ళి చేసుకుని జీవితాంతం ఒకడికిందే నలిగేకంటే రోజుకొకరితో ఎంజాయ్ చేస్తుంటే ఎన్నో కొత్త రుచులను రుచి చూడవచ్చు. యామ్ ఐ రైట్?' అని అతి ఘాటైన మాటలను వాడుతూ వాళ్ళని మరింత రెచ్చగొట్టింది. ఆమె తియ్యని మాటలకి వాళ్ళు పొంగిపోయారు.

అప్పటి వరకూ ఆమెని తన చేతులలో బంధించి వుంచిన మరో యువకుడు ఆమె తనతో సహకరిస్తున్నందుకు ఆమెను ఫ్రీగా వదిలేశాడు. ఇక




ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, న్యూజెర్సీ తెలుగు కళాసమితి నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

ఆ యువకులు తన మాటల మైకంలో పడ్డారని గ్రహించింది సృజన. అప్పటివరకూ వాళ్ళతో పెనుగులాడిన తన స్నేహితురాలు పద్మ వాళ్ళకి తెలియకుండా అక్కడి నుండి తప్పించుకుని పారిపోవటాన్ని గమనించి తేలిగ్గా నిట్టూర్చింది సృజన.

'కానియ్యండి మై ఫ్రెండ్స్. ఆలశ్యం అమృతం విషం అన్నారు పెద్దలు. ఆలస్యం చేస్తే ఎవరి నోటివెంటైనా నా రహస్యాన్ని తెలుసుకున్నారంటే మీరు నన్ను వదలి వెళ్ళిపోయినా వెళ్ళిపోగలరు. నా చివరి ఘడియల్లోనైనా నన్ను ఆనంద పెట్టండి' అంది బాధను నటిస్తూ.

'ఏమిటా రహస్యం?' వాళ్ళలో ఒకడు ప్రశ్నించాడు అనుమానంగా.

'ఉహూ' అది నేనిప్పుడు చెప్పను. మీరు పనికానిచ్చాక చెప్తాను.'

'ఊహూ. ఇప్పుడే చెప్పాలి' అన్నాడు మరొకడు మరింత అనుమానంగా.

'చెపితే మీరు నమ్మరు. నేను తప్పించుకోడానికి ఆ పథకం పన్నానంనుకుంటారు మీరు. అదే పనైన తర్వాత చెప్తానంటే మీకు నమ్మకం కలిగితీరుతుంది' అంది బుంగమూతి పెడుతూ సృజన.

'ఊహూ నువ్వు యిప్పుడే చెప్పి తీరాలి' గద్దించాడు మరొకడు.

'ఏం చెప్పకపోతే చంపేస్తారా! పోనీ చంపెయ్యండి. ఎలాగో ఇంకొద్ది రోజుల్లో హాస్పిటల్ బెడ్ మీద నేను చావవల్సినదాన్నేగా. రండి. చచ్చేలోపు మీరు నన్ను సుఖపెట్టండి' అని వాళ్ళని మరింత కన్ఫ్యూజన్ చేసింది.

అప్పటివరకూ ఆమె మీద కోరికతో వున్న ఆ యువకులు 'రహస్యం' 'హాస్పటల్ బెడ్' అని ఆమె ప్రయోగించిన మాటలకి కొంచెం జంకి ఆమె నుండి దూరంగా జరిగారు.

'ఇదేంట్రోయ్! ఏదో రహస్యం అంటుంది. ఆ రహస్యం మనతో చెప్పకుండానే మనతో గడుపుతానంటుంది. దీన్నిబట్టి చూస్తే ఈ పిల్లేదో మనకొంప ముంచేటట్టుంది' అన్నాడు భయంగా.

'ఏమిటే ఆ రహస్యం చెప్తేగాని మీరునన్ను తాకేలాగ లేరు' అంటూ వాళ్ళకి మరింత దగ్గరగా జరిగింది సృజన. 'అవును. అన్నట్టు తలూపారు ఆమెకు మరింత దూరం జరుగుతూ ఆ యువకులు.

'మరేంలేదు. చిన్న జబ్బే. 'ఎయిడ్స్' అని రహస్యంగా చెప్పింది సృజన.

'ఎయిడ్సా' హా!!! నిర్ఘాంతపోయారంతా.

'అవును. మా కాలేజీ బోయ్ ఫ్రెండ్స్‌తో ఎజాయ్‌చేశానని ఇందాక మీతో చెప్పాను కదా. వాళ్ళలో ఎవరికుందో ఏమో! అది వచ్చి నాకు అంటుకుంది. అయినా ఏం ఫర్వాలేదులే. మందులు వాడుతున్నా కదా! తగ్గిపోతుందిలే. ఆ రహస్యం చెప్పాగా. ఇక మాటలెందుకూ? చేతలు చూపిస్తే సరి' అంటూ గాలిలో ముద్దు విసిరింది. అంతే అదేదో విషంగాని తాకినట్టు ఫీలై అక్కడి నుండి వెనక్కి తిరిగి చూడకుండా పరుగందుకున్నారు ఆ నలుగురు పోకిరీ యువకులు.

'హలో ఫ్రెండ్స్. మిమ్మల్నే. నన్ను సుఖపెట్టరూ' అంటూ గట్టిగా అరుచుకుంటూ వాళ్ళని వెంబడించటం ప్రారంభించింది సృజన.

'ఒరి నాయనోయ్ ఆడ దెయ్యం' అని అనుకుంటూ ఆ ప్రాంతం నుంచి క్షణంలో మాయమైపోయారా యువకులు. వాళ్ళలా పారిపోవటం చూసి మనసులోనే నవ్వుకుంది సృజన. ఇదంతా నేనాడిన డ్రామా అని వాళ్లకెలా తెలుస్తుంది పాపం. 'శక్తికంటే యుక్తి బాగా పనిచేస్తుందంటారు పెద్దలు.' అది అక్షరాలా నిజమని యిప్పుడు రుజువయ్యింది. వాళ్ళ నలుగురుని ఎదిరించి పోరాడే శక్తి లేని తనకి కేవలం యుక్తితో తన మాన ప్రాణాలను రక్షించుకోగలిగింది.

'ఎయిడ్స్' మహమ్మారి అంటారందరూ. కాని అది ఉపకారి కూడా అని యిప్పటి సంఘటన్ని బట్టి తెలుస్తుంది. ఇప్పటి తన విషయంలో ఎయిడ్స్ అన్న పదాన్ని ఉపయోగించలేకుంటే తన మాన ప్రాణాలు పోయి హరీ అనేదే. అందుకే ఇకముందు అంటాను 'ఎయిడ్స్' అన్న పదం పెళ్ళికాని ఆడపిల్లల మానానికి రక్ష కవచమని అని అనుకుంటూ మనస్సులోనే ఎయిడ్స్‌కి కృతజ్ఞతలు తెల్పుకుంది సృజన.

చలపాక ప్రకాష్



### ఊర్మిళ కోపం

మమతా కులకర్ణికి తనకూ ఏవో గొడవలున్నాయని సొనాలి బెంద్రే తెగ ప్రచారం చేస్తోందని కోపం తెచ్చుకుంది. సొనాలి. అసలు మమతాకు నాకూ ఏం గొడవలు లేవు. ఆవిడేదో అనుకుని ఇంకేదో మాట్లాడేయటం ఏం సబబు గా లేదు అంది. ఇంత మంది ఆర్టిస్టులున్నారు ఎవరితోనూ నాకు గొడవలు లేవు కానీ సొనాలి కి ఈ విషయం ఎలా తెలుసు అని విసుక్కుంది.

## శ్వేత క్రాంతి

అనువాదం: కాళిపు కూర్మవతారం.
హిందీ: శ్రీ ప్రభాకర్ దీక్షిత్.

అదో చిన్న గ్రామం. దేవుడే కాకుండా ఒకే ఒక ఎమ్.ఎల్.ఏ గారి ప్రాబల్యం అక్కడ బాగానే వుంది. ప్రతి సభలోనూ సోషలిజం ప్రభుత్వం గురించే మాట్లాడుతూ ప్రజలపై మంచి పట్టు సంపాదించి ఆధిపత్యం చలాయిస్తుంటాడు.

ఓ రోజున–

'సోదరులారా! హరిత క్రాంతి తీసుకు రావడంలో నాయకులు విజయం సాధించారు. మరిప్పుడు హరిత క్రాంతితోపాటు శ్వేతక్రాంతి కూడా అవసరమే. అతి త్వరలో మీకు ఆ శ్వేతక్రాంతి కనబడబోతుంది' అని ఎం.ఎల్.ఎ గారు అన్నారు.

అక్కడ చేరిన జనమంతా ఏమీ అర్థం చేసుకోకుండాన్నే దడదడ చప్పట్లు కొట్టారు. చప్పట్లు పూర్తి కాగానే కొంత సేపు ప్రశాంతంగా వుంది. తరువాత ఆకస్మాత్తుగా గుసగుసలు ప్రారంభమయ్యాయి. జనమంతా ఒకరితో ఒకరు మాట్లాడుకోసాగారు.

ఓ ముసలివాడు లేచి 'బాబు గారూ! హరిత క్రాంతి అంటే ఏమిటో మాకు తెలుసు. కానీ సేత కరాంతి ఏటో మాకు తెల్దు' అని అన్నాడు.

ఎం.ఎల్.ఏ గారికేం పాలు పోలేదు. ఆయన బుర్ర గిర్రుమంది. సర్పంచ్ వైపు చూశాడు. సర్పంచ్ ఏమో ఆ ముసలివాని వైపు చూస్తూ నవ్వుతున్నాడు.

చేసేది లేక సిగ్గు పడుతూ 'టైమ్ రానివ్వండి. అంతా మీకు చెప్తాను' అని ఎం.ఎల్.ఎ అనగా ప్రజలు మరి మాటాడలేదు.

మర్నాడు తెల్లవారే సరికి ముసలివాడు పొలంలోకి వెళ్ళాడు. పొలంలో పడి చాలా ఎద్దులు పంటను కుమ్మి వేస్తూ తినేస్తూ ఉన్నాయి. దగ్గరకెళ్ళి చూస్తే అవి సర్పంచ్‌వి, ఎం.ఎల్.ఏ గారివని తెలిసింది. కోపంతో ఎం.ఎల్.ఎ గారింటికి పరుగు పరుగున వెళ్ళాడు. అలసిపోయిన ముసలివాడు ఆయాసంతో 'బాబు గారూ! తమ ఎద్దులు నా హరిత కరాంతిని మేసేస్తున్నాయి' అని అన్నాడు.

ఎం.ఎల్.ఏ సంబాళించుకుని, కొద్దిగా ఆలోచిస్తూ 'ఎద్దులు తెల్లటివేనా?' అని అడిగాడు.

'అవును బాబూ, తెలుపు పేరుకంటే తెల్లటివి' చిరాకుతో గట్టిగా అన్నాడు.

ఒక్క ఊపున ఎం.ఎల్.ఎ గారు మంచం మీద నుంచి లేచి నిల్చొని గట్టిగా 'ఒరి, దద్దమ్మా! నీ పొలంలోకి శ్వేత క్రాంతి వచ్చింది' అని అన్నారు. వెంటనే సర్పంచ్‌ని బరబరా లాక్కొని పొలం వైపు పరుగెత్తాడు. ఎం.ఎల్.ఎ ముసలివాడు బుర్ర గోడకేసి బాదుకుంటూ 'అయ్యో... ఒరి బాబోయ్...! నా పొలంలోకి సువేత కరాంతి వచ్చింది బాబోయ్...!' అని గట్టిగా అరిచాడు. ఆ ముసలివాడు ఏడుస్తూ ఉన్నాడు. సర్పంచ్‌ని, ఎం.ఎల్.ఎ గారిని వెదకి పట్టుకోవాలని గ్రామస్తులు బయలుదేరారు. కానీ, వాళ్ళిద్దరూ ఎద్దుల మధ్య కలిసిపోయారు. అక్కడ అంతా తెల్లగానే కనిపిస్తుంది.